ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA
APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 67 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం 07 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02



## 9 మంది పోలీసులకు మరణ శిక్ష

ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడులో వెలుగుచూసిన తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులో తాజాగా సంచలన తీర్పు వెలువడింది. ఇందుకు బాధ్యులైన తొమ్మిది మంది పోలీసులకు మదురైలోని ఫస్ట్ అడిషనల్, డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధించింది. తూతుకుడి జిల్లాలో 2020 నాటి కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సమయం షాపును నిర్వహించిన కేసులో షాపు యజమాని జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కస్టడీలో ఉండగా వారు మరణించడంతో ఘటనపై దర్యాప్తు మొదలైంది. స్టేషన్‌లో వారిని టార్చర్ చేయడంతో తీవ్రగాయాల పాలై మరణించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న సీబీఐ వాదనలతో కోర్టు ఏకీభవించింది. దోషులు తమ అధికారాన్ని దుర్వినియోగపరిచారని, అత్యంత క్రూరంగా ప్రవర్తించారని అభిప్రాయపడింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా పేర్కొంది. ఈ కేసులో దోషులుగా తేలిన ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు పి.రఘు గణేశ్, కే. బాలకృష్ణన్, హెడ్ కానిస్టేబుల్స్ ఎస్ మురుగన్, ఎ సమదురై, కానిస్టేబుల్స్ ఎమ్ ముత్తురాజ్, ఎస్ చెల్లదురై, ఎక్స్ థామస్ ఫ్రాన్సిస్, ఎస్ వైల్‌ముత్తులకు న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. ఇక ఈ కేసులో పదవ నిందితుడిగా ఉన్న స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాల్‌దురై కొవిడ్‌తో గతంలో మరణించాడు.

## తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో' !

* నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధం
* త్వరలో ముసాయిదాపై స్పందిస్తాం : ఇరాన్
* హోర్ముజ్‌పై గుత్తాధిపత్య శకం ముగిసిందని స్పష్టీకరణ
* ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
* తాజా భీకర దాడుల్లో 34 మందికి పైగా మరణం
* అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరపం : ఇరాన్
* ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
* హోర్ముజ్‌కు పూర్వపు హోదా ఇచ్చేది లేదు
* టెహ్రాన్‌లో 34 మంది మరణం





టెహ్రాన్: పశ్చిమాసియాలో దాదాపు నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించేందుకు ఇరాన్ సుముఖంగా లేదని ఓ సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని ఆయన సోమవారం వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హోర్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. కాగా రెండంచెల ముసాయిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరుపక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరగవని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె స్పష్టం చేశారు.

## చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

* స్వదేశీ ప్రజలను ముప్పులోకి నెట్టే ప్రయత్నం: మోదీ
* 'మహిళా రిజర్వేషన్ చట్టం వల్ల రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఎలాంటి ధోకా ఉండదు'
* అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
* కాంగ్రెస్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం!
* మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం!



## దేశాల అప్పులు పెరిగాయి

* పశ్చిమాసియా సంక్షోభంతో క్లిష్ట పరిస్థితులు
* కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ వెల్లడి
* ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు
* సెబీ చైర్మెన్ హెచ్చరిక
* ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు : సెబీ చైర్మెన్ హెచ్చరిక
* న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ)లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతారామన్




పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థకు మరిన్ని సవాళ్లను విసురుతోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం దిశగా పని చేస్తున్న తరుణంలో భారత్ బాహ్య, అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటోందని మంత్రి స్పష్టం చేశారు. వర్షపాతం వంటి అంశాలు కీలకమైన దేశీయ ఆందోళనలుగా ఉన్నాయని తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ)లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతారామన్ మాట్లాడారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఘర్షణల కారణంగా ప్రాంతీయ భద్రతా సమస్యలు తలెత్తాయని దీంతో భారత్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరింత క్లిష్టంగా ఉండే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సంఘర్షణను ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థకు ముప్పుగా పరిణమించిన ఒక వ్యవస్థాగత ప్రకంపన (సిస్టమిక్ ట్రెమర్) గా అభివర్ణించారు.

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

* భూమి నుంచి రికార్డు దూరంలో
* 1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం
* 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు



## ప్రతీ ఎకరాకు సాగునీటి హామీ! - సీఎం చంద్రబాబు




2వ పేజీలో

## హామీలు నెరవేరుస్తున్నాం

మేం పాలకులం కాదు..ప్రజా సేవకులం
ఆదిలాబాద్ ప్రజల గుండెల నిండా అభిమానం
ప్రతి రెండు నెలలకోసారి వస్తాం.. నిధులు ఇస్తాం
బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
తుమ్మిడిహెట్టి, ప్రాణహిత నిర్మాణానికి సర్వే : పిప్రి గ్రామ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
రూ.225 కోట్లతో బాసర సరస్వతీ ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



# ప్రతీ ఎకరాకు సాగునీటి హామీ! - సీఎం చంద్రబాబు

"నీటిబొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలి. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు–ప్రగతి తీసుకువచ్చాం. పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని పంటలకు మళ్లించాలి. రాయలసీమలోని 20 వేల చెరువులు పూర్తిగా నింపాం. భూగర్భ జలాలు పెంచాం, ఇంకా పెంచేందుకు చర్యలు. ప్రతీ ఎకరాకు నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిది. గోదావరి, కృష్ణా నుంచి వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీళ్లు నిల్వ ఉంచుకుంటే చాలు, అవే సంపద సృష్టిస్తాయి." – సీఎం చంద్రబాబు

బ్యాంకుల్లో డబ్బు దాచినట్లే భూగర్భాన్ని జల బ్యాంకుగా మారుద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. అలా చేస్తే ఏపీలో కరవే ఉండదన్నారు. చెరువులు, సాగునీటి కాలువల్ని ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా వదులుకోవాలని స్పష్టం చేశారు. లేదంటే అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేస్తామని పునరుద్ఘాటించారు. "నీటి భద్రత–సాగునీటి సంఘాల బాధ్యత" అంటూ అనంతపురం జిల్లా యాడికిలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత భూగర్భ జలాల పెంపు విధానాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఉత్తమ విధానాల గురించి కలెక్టర్, ఎమ్మెల్యేలు సీఎంకు వివరించారు. ప్రతీ ఎకరాకు నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిదని చెప్పిన సీఎం దాన్ని సద్వినియోగం చేసుకునే బాధ్యత ప్రజలదని స్పష్టం చేశారు. రాయలసీమను ప్రపంచానికే హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నట్లు ప్రకటించారు.

అనంతపురంలో జిల్లాలో భూగర్భ జలాలను 11.25 మీటర్లకు తీసుకొచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటిఎద్దటి లేకుండా చేసేందుకు అండగా ఉంటామన్నారు. రాయలసీమలో సాగునీటి కోసం కొట్లాటలు ఉండేవని గుర్తు చేశారు. అన్నమయ్య జిల్లాలో భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. భూగర్భ జలాలు పెరిగితే కరెంట్ ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు.

**వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి :** "శ్రీశైలం, మల్యాలలో పంపులు పెట్టి నీరు తెస్తున్నాం. యాడికి మండలాన్ని పూర్తిగా సస్యశ్యామలం చేసే బాధ్యత మాది. ఈ ఏడాది 70 టీఎంసీల నీటిని అనంతపురం జిల్లాకు తీసుకువచ్చాం. నీరు సమృద్ధిగా ఉంటేనే రాయలసీమ రతనాలసీమగా మారుతుంది. దేశంలోనే ఎక్కువ పళ్లు, కూరగాయలు పండే జిల్లాగా అనంతపురాన్ని మారుస్తాం. గోదావరి, కృష్ణా నుంచి వేల టీఎంసీలు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. గంగా నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం జరగాలి. ఈ 21 నెలల్లో పోలవరం డయాఫ్రం వాల్ కొత్తది కట్టాం" అని చంద్రబాబు తెలిపారు.

**గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి :** "వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు–మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు అదే సంపద సృష్టిస్తుంది" అని చంద్రబాబు అన్నారు.

**జగన్‌కు పిచ్చి ముదిరింది :** నదుల అనుసంధానంతో ఏపీకి నీటి భద్రత కల్పిస్తామన్న సీఎం సాగునీటి చెరువులు, కాలువలను పునరుద్ధరించే విషయంలో రాజీ పడొద్దని అధికారులకు తేల్చిచెప్పారు. ఇదే సమయంలో అమరావతి విషయంలో వైఎస్సార్సీపీ తీరును తూర్పారబట్టిన చంద్రబాబు, జగన్‌కు పిచ్చి ముదిరిందని ఎద్దేవా చేశారు. మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైఎస్సార్సీపీపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. "రాష్ట్రంపై పగబట్టారు ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని అది అమరావతి" అని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీకి రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న చంద్రబాబు, అమరావతి, విశాఖ, తిరుపతి మెగా సిటీలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

# హామీలు నెరవేరుస్తున్నాం

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పాలకులుగా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన తీసుకురావడానికి చేసిన పోరాటంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం సీఎం పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా బాసరలో రూ.225 కోట్లతో జ్ఞాన సరస్వతి ఆలయం పునర్నిర్మాణ పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మనుమడికి ఆలయంలో అక్షరభ్యాసం చేయించారు. అనంతరం రూ.1,250 కోట్లతో బోథ్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో 'ప్రజాపాలన–ప్రగతిబాట' బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. పోరాటయోధుడు కుమురంభీం స్ఫూర్తితో ప్రజాపాలన తీసుకురావడానికి పోరాటాల పురిటిగడ్డ ఇంద్రవెల్లి నుంచి టీపీసీసీ నాయకుడిగా యాత్ర ప్రారంభిస్తే సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క పిప్రి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారని గుర్తు చేశారు. ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను నేడు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల నిండా అభిమానం ఉందని, మహబూబ్‌నగర్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేస్తానో ఆదిలాబాద్‌ను కూడా అదే విధంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. రాబోయే గోదావరి పుష్కరాలకు నిధులు కేటాయించడంతోపాటు బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటిగా గూడెం సత్య నారాయణ స్వామి ఆలయానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా త్వరలోనే గిరిజన యునివర్సిటీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలు పారిశ్రామికపరంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధిపర్చడమే కాకుండా 2034 నాటికి విద్యాకేంద్రంగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వస్తానని, వచ్చిన ప్రతిసారీ నిధులు కేటాయిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, ఇందుకు రూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు. ఇప్పటివరకు రూ.5,400 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఎంపీ గొడెం నగేష్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, అనిల్‌జాదవ్, రామారావ్ పటేల్, మహేశ్వర్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావ్, కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, హరిత, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో' !

ఓ పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయని, వాటిని ఇప్పటికే మధ్యవర్తుల ద్వారా తెలియజేశామని అన్నారు. అయితే ఇవి మితిమీరి ఉన్నాయంటూ అమెరికా పంపిన 15పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ఇప్పటికే తిరస్కరించిందని తెలిపారు. చట్టబద్ధమైన తమ డిమాండ్లను స్పష్టంగా వివరించడంలో ఇరాన్ వెనుకాడబోదని అన్నారు. ఆ విధంగా చేయడాన్ని రాజీ సంకేతంగా భాష్యం చెప్పరాదని అన్నారు. దానికన్నా తమ వైఖరులను నిర్వచించడంలో తమ విశ్వాసాన్ని వ్యక్తీకరించడంగా చూడాలని తెలిపారు. త్వరలో మా స్పందనలు తెలియపరుస్తాం, వివరాలు వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. కాల్పుల విర మణ ప్రణాళికపై ఇరాన్ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా చెప్పారు. కాగా అమెరికా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు. పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ అంద్రబి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

**ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి**

ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మాజిద్ ఖాదెమి సోమవారం నాటి దాడుల్లో మృతి చెందారు. అమెరికా–యూదు (ఇజ్రాయిల్) శత్రువు జరిపిన తీవ్రవాద దాడిలో మాజిద్ మరణించారని ఇరాన్ గార్డ్స్‌ను ఉటంకిస్తూ ఇరాన్ మీడియా వెల్లడించింది. గతేడాది ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ మరణించడంతో మాజిద్ బాధ్యతలు చేపట్టారు. తాజా దాడుల్లో ఆయన కూడా చనిపోయారు. ఇరాన్ భద్రతా యంత్రాంగ వ్యవస్థలో అంచెలంచెలుగా ఎదుగుతూ గూఢచర్యం, ప్రతి గూఢచర్యం పాత్రల్లో ఆయన దశాబ్దాలుగా అనుభవం గడించారు. ఇంటెలిజెన్స్ హెడ్‌గా ఖాదెమి బాధ్యతలు చేపట్టడానికి ముందుగా ఇరాన్ రక్షణ శాఖలో పలు కీలక పాత్రలు పోషించారు. విదేశీ ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు దేశీయ నిఘా రంగంలో ఇంటెలిజెన్స్ విభాగానిది కీలక పాత్ర.

**హార్ముజ్‌కు పూర్వపు హోదా ఇచ్చేది లేదు**

అంతర్జాతీయ నౌకల రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధికి పూర్వపు హోదా తిరిగి ఇచ్చే ప్రశ్నే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ యుద్ధానికి ముందున్న పరిస్థితి మళ్ళీ రాదని పేర్కొంది. ఇతర దేశాల నౌకల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేవలం తమ శత్రు దేశాల నౌకలకు మాత్రం ఎలాంటి అనుమతినిచ్చే ప్రశ్నే లేదని తేల్చి చెప్పింది. మార్చడానికి వీల్లేని కొన్ని వ్యూహాత్మక మార్పులు చేపట్టామని తెలిపింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నేవీ ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఈ జలసంధిపై విదేశీ గుత్తాధిపత్యం శకం ఇక ముగిసింది' అని వ్యాఖ్యానించింది. ఇటీవల జరిగిన ప్రాంతీయ పరిణామాలు కొత్త వాస్తవికతను నెలకొల్పాయని, ఆ నేపథ్యంలో ఇక ఇరాన్ సమీప సముద్ర జలాల్లో అమెరికా తన షరతులు, నిబంధనలు నిర్దేశించలేదని తేల్చి చెప్పింది

**టెహ్రాన్‌లో 34 మంది మరణం**

హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందం కుదుర్చుకోవాలని డిమాండ్ చేస్తూ ఇరాన్‌కు ఇచ్చిన 10రోజుల గడువు ముగిసిపోతున్న తరుణంలో ఇక భీకర దాడులు తప్పవని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లో పలుచోట్ల సోమవారం జరిగిన దాడుల్లో 25మంది మరణించారు. టెహ్రాలోని షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీని లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు జరిపినట్టు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డ్స్ నియంత్రణలో గల ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమంపై మిలటరీతో కలిసి ఈ యూనివర్శిటీ పనిచేస్తోంది. ఇందుకు గానూ ఈ యూనివర్శిటీపై అనేక ఏండ్లుగా అనేక దేశాలు ఆంక్షలు విధించాయి. కాగా ఈ దాడులకు ప్రతిగా ఇజ్రాయిల్‌పై, గల్ఫ్ అరబ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ కూడా క్షిపణులతో విరుచుకుపడింది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారు జామున టెహ్రాన్‌లో పలుచోట్ల పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు, తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానాల శబ్దాలు వినిపించాయి. గంటల తరబడి దాడులు కొనసాగాయి. టెహ్రాన్‌లో ప్రభుత్వ లక్ష్యాలపై దాడులు పూర్తి చేశామని ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. ఈ దాడుల్లో వర్సిటీ క్యాంపస్‌కు సమీపంలోని గ్యాస్ పంపిణీ కేంద్రం దెబ్బతింది. అక్కడున్న ఇతర భవనాలు కూడా ధ్వంసమయ్యాయి.

# చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

"బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ బహిరంగంగానే చొరబాటుదారులకు మద్దతు ఇస్తోంది. పైగా అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తోంది. అసోంలో కాంగ్రెస్ ఎలాంటి చట్టాన్ని తీసుకురావాలని అనుకుంటోందంటే, ఎవరైనా చొరబాటుదారుడు అనే పదాన్ని ఉపయోగిస్తే, వారు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్? పార్టీ చట్టంలోనే చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణిస్తుంది. దీని వల్ల మెజారిటీ స్వదేశీ ప్రజలు జైలు శిక్ష ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది." - ప్రధాని మోదీ

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం విమర్శల వర్షం గుప్పించారు. అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, అక్రమ భూఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణించే చట్టాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దీని ద్వారా స్వదేశీ ప్రజలు ప్రమాదంలో పడుతుందని మోదీ పేర్కొన్నారు. 'శ్రీమంత శంకరదేవ, మాధవదేవ, దామోదరదేవ, హరిదేవ్ మొదలైన వైష్ణవ సాధువుల పవిత్ర మఠాలకు చెందిన వేల బిగాల భూమి బార్పేటలో ఉంది. ఆ భూమిని చొరబాటుదారులు ఆక్రమించుకునేందుకు కాంగ్రెస్ అనుమతించింది. దీనితో చాలా భూభాగం అక్రమ ఆక్రమణలకు గురైంది' అని మోదీ ఆరోపించారు.

**కాంగ్రెస్?కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం!**

అసోం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని నొక్కి చెబుతూ, బోడో సామాజిక వర్గానికి చెందిన 'హుదుమ్ పూజ', కోచ్? –రాజ్?బోంగ్షి వర్గానికి చెందిన 'బాతౌ' అనేవి అసోం సంస్కృతి, ప్రకృతి, విశ్వాసాల మధ్య ఉన్న సామరస్యానికి ఉదాహరణలుగా ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందువల్ల అసోం సంప్రదాయాలకు గొప్ప నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.

**మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం!**

మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై కూడా మోదీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

**డీలిమిటేషన్?**

దేశంలోని నియోజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా నిర్ణయించారు. దీనికి అనుగుణంగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. ఈ చట్టాన్ని ఆమోదించడానికి 2/3వ వంతు మెజారిటీ అవసరం. అందుకే ప్రతిపక్ష పార్టీల మద్దతు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్? 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే దీనిపై చర్చించనున్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

న్యూయార్క్ : అమెరికా అంతరిక్ష సంస్థ–నాసా చేపట్టిన ఆర్టెమిస్–2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్ల దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

# అరుణాచల్ సీఎంపై సీబీఐ దర్యాప్తు

అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రి పెమా ఖాండూ తన కుటుంబ సభ్యులు, బంధువులకు అక్రమంగా ప్రభుత్వ కాంట్రాక్టులు కట్టబెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. సుమారు రూ.1,270 కోట్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను ఆయన తన కుటుంబసభ్యులు, బంధువులకు అప్పనంగా అప్పగించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సేవ్ మాన్ రీజియన్ ఫెడరేషన్, వలంటరీ అరుణాచల్ సేనలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేయాలని కోరాయి. ఈ పిటిషన్‌లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని సీబీఐని ఆదేశించింది.

# దేశాల అప్పులు పెరిగాయి

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత, అస్పష్టతను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ప్రభుత్వ అప్పులు పెరిగాయని మంత్రి చెప్పారు. అయితే.. రుణ నిర్వహణలో భారతదేశం ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థల తరహాలోనే జడిపిలో 81 శాతం లోపు అప్పు నిష్పత్తిని కలిగి ఉందన్నారు. ప్రపంచ సవాళ్ల దృష్ట్యా ప్రభుత్వ రుణాలను చాకచక్యంగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. భారతదేశానికి ఆర్థిక వెసులుబాటు ఉందని, పెట్టుబడి వ్యయాన్ని విస్తరించే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రభావిత రంగాలకు వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా మద్దతు ఇచ్చే అవకాశం రిజర్వ్ బ్యాంక్‌కు ఉందని ఆమె వెల్లడించారు. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న అస్పష్టతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని మంత్రి అన్నారు.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు : సెబీ చైర్మెన్ హెచ్చరిక**

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయని సెబీ చైర్మెన్ తుహిన్ కాంత పాండే ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముడి చమురు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. సోమవారం జరిగిన సీఐఐ కార్పొరేట్ గవర్నెన్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ.. కరోనా సృష్టించిన అస్థిరత, కృత్రిమ మేధ (ఏఐ) వంటి సాంకేతిక మార్పుల సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరోసారి సంక్షోభంలోకి నెట్టేస్తోందని హెచ్చరించారు. ఇటువంటి అనిశ్చిత పరిస్థితుల్లో వ్యాపార సంస్థలు తమ ఉనికిని చాటుకోవాలంటే పటిష్టమైన పాలనా ప్రమాణాలు పాటించడం అత్యవసరమన్నారు. కంపెనీల బోర్డు నిర్ణయాల్లో నాణ్యత పెరగాలని, ముఖ్యంగా స్వతంత్ర డైరెక్టర్లు సంస్థల పర్యవేక్షణలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# మార్కాపురం బస్సు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాన్ని పరామర్శించిన కాకాణి పూజిత

**– పొదలకూరు లో ఇటీవల ప్రమాదానికి గురైన శ్రీను ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న పూజిత**

**– వెంకటేశ్వర్లు ఘోర బస్సు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం**

**– నిండు ప్రాణం పోయిన తర్వాత వెనక్కి తీసుకురాలేం**

**– రాష్ట్రంలో ఇలాంటి ఘోరాలు ఇకపై జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి**

**– కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి శాంతి భద్రతలపై దృష్టి పెట్టాలి**

**– కూటమి పాలనలో అత్యవసర సేవలు కుప్పకూలాయి**

**– ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆదుకోవాల్సిన అత్యవసర (108 )వైద్య సేవలు పూర్తిగా పడకేసాయి**

**– కూటమిపాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతుంది**

**– మృతుడు వెంకటేశ్వర్లు కు నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన పూజిత**

**– కాకాణి పూజితమ్మ స్కోలింగ్ పాయింట్స్**



**విజ్ఞాన పత్రిక పొదలకూరు** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఇటీవల ప్రకాశం జిల్లా,మార్కాపురం వద్ద ప్రమాదం జరిగి, బస్సు కాలిపోయిన సంఘటనలో మృతి చెందిన ముత్తంగి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని, సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు గ్రామ పంచాయతీ, వెంకటేశ్వర నగర్ లోని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పిన, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షాన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని ముత్తంగి వెంకటేశ్వర్ల కుటుంబానికి అందజేసిన కాకాణి పూజిత మృతి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున రూ. 1 లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించాం. " ఆర్థిక సాయం ప్రాణాన్ని నిలబెట్ట లేకపోయినా, ఆ కుటుంబం ఒంటరిది కాదని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పడానికే ఇక్కడికి వచ్చాం" . ప్రైవేట్ వాహనాలు మరియు బస్సుల నిర్వహణపై ప్రభుత్వం సరైన నిబంధనలు అమలు చేయాలి, తనిఖీలు నిరంతరం జరగాలి . రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వరుసగా అవాంఛనీయ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి . డ్రైవర్ల నిర్లక్ష్యం లేదా వాహనాల్లోని సాంకేతిక లోపాలపై రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాలి,భవిష్యత్తులో ఇటువంటి పొరపాట్లు పునరావృత్తం కాకుండా చూసుకోవాలి. వెంకటేశ్వర్లు గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని దేవున్ని వేడుకుంటున్నా .కూటమి పాలనలో ప్రమాదం జరిగినప్పుడు సమయానికి అంబులెన్స్ రాక అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి . ఆంధ్ర రాష్ట్రంలో 108 సేవలకు ఫోన్ చేస్తే 26 నిమిషాల వరకు ఎవరూ స్పందించని పరిస్థితి నెలకొంది .– అంబులెన్స్ సమయానికి వచ్చి, సరైన వైద్యం అంది ఉంటే ప్రమాద బాధితులలో కొంతమంది ప్రాణాలైనా దక్కేవి .కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం కంటే 'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేయడమే ముఖ్యమైంది . కేవలం వైఎస్ఆర్ సీపీ నాయకులపై కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప, అభివృద్ధి, సంక్షేమం, అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది . అధికారులు,ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రతిపక్ష పార్టీ నేతలపై నిందలు వేయడంలో బిజీగా ఉండటం వల్ల రవాణా భద్రత, ప్రైవేట్ వాహనాల నిబంధనల తనిఖీ, వంటి కీలక అంశాలను గాలికొదిలేశారు . కూటమి ప్రభుత్వం కేవలం నష్టపరిహారం చెల్లించడం వల్ల ప్రయోజనం లేదు. ఇటువంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది . జగనన్న హయాంలో ఎంతో వేగంగా అందిన 108 అంబులెన్స్ సేవలు, నేడు కూటమి పాలనలో ఎందుకు విఫలమవుతున్నాయో అర్థం కావడం లేదు . ఒక నిండు ప్రాణం కోల్పోయిన తర్వాత దానిని తిరిగి తీసుకురాలేము, ఈ ఘటన నన్ను ఎంతో కలిచివేసింది . ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి, రాష్ట్రంలో ఇలాంటి ఘోరాలు పునరావృతం కాకుండా చూడాలి . మృతి చెందిన వెంకటేశ్వర్లు గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నా . వెంకటేశ్వర్లు గారి ని కోల్పోయిన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్న

# ఆదర్శం

బాధ్యత లేని ఆడది
ఇంద్ర భవనాన్ని సైతం
గుడిసెగా మారుస్తుంది
బాధ్యతగా ఉన్న ఆడది
ఉన్న గుడిసెను కూడా
ఒక ఇంద్ర భవనంగా
తీర్చిదిద్ది పదిమందికీ
ఆదర్శంగా నిలుస్తుంది
ఆడ, మగ అనే
ఇద్దరు వ్యక్తులు కలిస్తేనే
ఈలోకం లోకి వచ్చావు
నిన్ను నలుగురు మోస్తే
ఈ లోకం విడిచి వెళ్తావు
నిన్ను కన్న ఆ ఇద్దరికీ
ఏ కష్టం అనిపించకు
నిన్ను మోసే ఆనలుగురికీ
ఇష్టం అనిపించుకో!
నలుగురికి సాయం చేసే
గుణమే నీదైతే చాలు
నువ్వు ఏ గుడికీ
వెళ్లాల్సిన అవసరం లేదు
నువ్వు నమ్మే దైవం
నిన్నే వెతుక్కుంటూ
నీ దగ్గరకే వస్తుంది
నీకు జ్ఞానం కావాలంటే
ప్రపంచాన్ని జయించాలంటే
బడికి మాత్రం వెళ్ళాలి.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# క్షణికావేశాలతో కుటుంబాలను నాశనం చేసుకోవద్దు..!

**- సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి. శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్.**




**గూడూరు విజ్ఞాన్ పత్రిక** పాశ్చాత్య విషసంస్కృతికి బలి కావద్దు అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ లు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, మద్యం విచ్చల విడిగా దొరుకుతూ ప్రజల ప్రాణాలను హరిస్తుందన్నారు.దీనిని కట్టడి చేయడంలో ప్రభుత్వం , అధికారులు పూర్తిగా విఫలమైనారన్నారు.ఇకనైనా ప్రభుత్వం మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి , ప్రజల ప్రాణాలను కాపాడాలని పేర్కొన్నారు. సమాజంలో నేడు జరుగుతున్న అమానియ ఘటనల పైన కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమై క్షణకావేశాలతో కుటుంబాలను బలి చేసుకుంటున్నా నేటి సమాజంలో ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు .ఒకప్పుడు విదేశాల్లో ఉన్న పాశ్యత్య సంస్కృతి నేడు భారతదేశంలోకి జొరబడి ప్రధాన నగరాల్లో ఉన్న ఈ సంస్కృతి చిన్న చిన్న పట్టణ ప్రాంతాల్లో కూడా విస్తరించి కుటుంబ వ్యవస్థ లో ఏర్పడిన చిన్న చిన్న విషయాల పైన కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నమై ముక్కుపచ్చలారని పిల్లలు రోడ్డున పడుతున్నారని ప్రధానంగా ఈ మధ్యకాలంలో చిన్న చిన్న గొడవలు మూలంగా భార్య భర్తను చంపడం భర్త భార్యని చంపడం షరా మామూలు అయిందని దీనిపైన ప్రభుత్వాలు ప్రజలకు పెద్ద ఎత్తున చైతన్యపరిచి కుటుంబ వ్యవస్థను పటిష్టపరచాల్సినటువంటి అవసరం ఉంద ని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా ప్రజలు కూడా సమాజం పైన అవగాహన పెంచుకోవాలని సోషల్ మీడియాలో వచ్చే రీల్స్ వివిధ వీడియోలు చూసి ప్రధానంగా యువత చెడు మార్గానికి వెళుతున్నారని దీనిలో మంచెంతో చెడు ఎంతో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ గా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. పోలీసు వ్యవస్థ ఇలాంటి జరగరాని ఘటనలు జరిగినప్పుడు నిందితులపై కఠినంగా వ్యవహరించి మరల ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉ ందని వారికి విజ్ఞప్తి చేశారు .ఏది ఏమైనా ఇలాంటి ఘటనలు రోజు ఏదో ఒక ప్రాంతంలో జరిగి పత్రికల ద్వారా మీడియా ద్వారా చూసి కలత చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్కడికక్కడ హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన పెంచి ఇలాంటి ఘటనలు జరగకుండా సమాజంలో విపరీత దొరనులకు పాల్పడకుండా ఉండడానికి కావలసిన అవగాహన పెంచాలని తెలిపారు. యువత మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపకుండా , సేవా కార్యక్రమాల పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , వెంకటయ్య , చైతన్య , అనూక్, విజయ భాస్కర్ రెడ్డి , జయరామి రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల భూమిని ఆక్రమిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**- తహసీల్దార్ కార్యాలయం ముందు దివ్యాంగుల ధర్నా**



**కావలి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** దివ్యాంగుల భూమిని ఆక్రమిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి తహసీల్దార్ కార్యాలయం ముందు దివ్యాంగుల రాష్ట్ర నేత మండవ వెంకట్రావు దివ్యాంగుల ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండవ వెంకటరావు మాట్లాడుతూ కొంతమంది వచ్చి దివ్యాంగుల భూమిని ఆక్రమించుకొని పూరి గుడిసెలు నిర్మించుకుంటున్నారని వెంటనే అధికారుల స్పందించి దివ్యాంగుల భూమిని ఆక్రమించిన వారి పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే తహసిల్దార్ బయటికి వచ్చి సమస్యను వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు రెండు మూడు రోజుల్లో సమస్యల పరిష్కరించకపోతే నిరాహార దీక్ష దిగుతామని దివ్యాంగులు తాసిల్దార్ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు భాష, భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# 46వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం





**విజ్ఞాన్ పత్రిక పొదలకూరు** పొదలకూరు మండలంలో పొదలకూరు బస్టాండ్ నందు మరియు బిరదవోలు గ్రామంలో 46వ భారతీయ జనతా పార్టీజెండా ఆవిష్కరణ జరుపబడింది ముఖ్య అతిథులుగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరకాల మోహనబాబు గారు మండల అధ్యక్షులు పూల ప్రశాంత్ మండల ఉపాధ్యక్షులు రాచపూటి ధనుంజయ్ రావు చొప్ప వెంకటేశ్వర్లు మండల ప్రధాన కార్యదర్శి అక్కెం జనార్ధన్ రెడ్డి మండల కార్యదర్శి డబ్బుగుంట అంకయ్య మరియు వేణుగోపాల్ నాయుడు వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం సంఘన పెంచల్ రెడ్డి ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చిదదల రంగారావు గారు కిసాన్ మోర్చా జడ వెంకటేశ్వర్లు మరియు తదితరులు పాల్గొన్నారు

# బూచేపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దద్దాల



**కనిగిరి (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 06 కందుకూరు** నియోజకవర్గం లో ఒంగోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకల్లో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పాల్గొన్నారు.లి ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ని దుశ్శాలువతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేసారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు..ఈ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్ వెంట కనిగిరి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# మనసున్న డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ గారి సేవతో వికలాంగ కుటుంబానికి వెలుగు : బాబు ఏసిపోగు



**విజ్ఞాన దిన పత్రిక విలేకరి ఆత్మకూరు** మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన పుట్టుకతోనే వికలాంగుడు రవిచంద్ర కుటుంబానికి మానవత్వంతో సహాయం అందించారు. డాక్టర్ వింజం దొరసనమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సేవా కార్యక్రమం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ గారి ఆదేశాలతో జరిగింది. వారి మార్గదర్శకత్వంలో ట్రస్ట్ సభ్యులు తోడేటి అశోక్, షాహిదీన్ గ్రామానికి వెళ్లి స్వయంగా సరుకులు అందించారు. రవిచంద్ర కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు మానవత్వంతో సహాయం అందించిన డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ గారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. ఇలాంటి కుటుంబాలకు అండగా నిలుస్తున్న డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ గారి సేవా భావం అభినందనీయం.

# నారా లోకేష్ తో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భేటీ

**-కందుకూరు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ**



**కందుకూరు (విజ్ఞాన్ రిపోర్టర్) ఏప్రిల్ 06** రాష్ట్ర ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో... కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం విజయవాడలోని ఉండవల్లిలో భేటీ అయ్యారు కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ఇతర కార్యక్రమాల గురించి లోకేష్ కి నాగేశ్వరరావు వివరించారు. అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు ఇస్తుండడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా పెండింగ్ లో ఉన్న పనుల గురించి ప్రస్తావించిన నాగేశ్వరరావు... వాటికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు

# జూనియర్ సివిల్ జడ్జి గా నియమితులైన సత్య ధనుషా ను సత్కరించిన ఎమ్మెల్యే



**కావలి విజ్ఞాన్ దిన పత్రిక రిపోర్టర్** కావలి పట్టణం బృందావనం హౌసింగ్ కాలనీకి చెందిన దరిశి వెంకట సత్య ధనుషా ఏపీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా సోమవారం కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన విశిష్ట సాధనతో కావలి కి గర్వకారణంగా నిలిచిన దరిశి వెంకట సత్య ధనుషాను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

## ఆటిజం పై అవగాహన సమాజానికి ఒక బాధ్యత డా. దినేష్, న్యూరోసర్జన్ మెడికల్ హాస్పిటల్



**విజ్ఞాన్ దినపత్రిక టౌన్ రిపోర్టర్** ఆటిజం అనేది ఒక న్యూరో డెవలప్‌మెంటల్ డిసార్డర్. ఇది పిల్లల మెదడు అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. పిల్లలు మాట్లాడటం, ఇతరులతో కలిసిమెలసి ఉండటం, భావోద్వేగాలను వ్యక్తపరచడం వంటి విషయాల్లో కొంత వెనుకబడవచ్చు. ఆటిజం లేదా చాబ్ఱంఎ ాజూవష్తీబఎ ఱఱంశీతీసవతీ (ూూాఔ) అనేది విభిన్న లక్షణాలతో కనిపించే ఒక పరిస్థితి. ప్రతి పిల్లలో లక్షణాలు వేరువేరుగా ఉండవచ్చు అని మెడికల్ హాస్పిటల్ న్యూరోసర్జన్ డాక్టర్ దినేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షణాలు: మాట్లాడటంలో ఆలస్యం కన్ను కలుపకపోవడం పేరుపిలిచినా స్పందించకపోవడం ఇతరులతో ఆడుకోవడానికి ఆసక్తి లేకపోవడం పిటి లక్షణాలు అని ఆయన అన్నారు.ఆటిజం ఎందుకు వస్తుందో పూర్తిగా తెలియదు. కానీ జన్యు కారణాలు, గర్భధారణ సమయంలో పరిస్థితులు, మెదడు అభివృద్ధి లోపాలు వంటి అంశాలు కారణమై ఉండవచ్చు అని ఆయన అన్నారు.పిల్లలో ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా నిపుణుడిని సంప్రదించినట్లయితే ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స మరియు థెరపీ ద్వారా మంచి అభివృద్ధి సాధ్యమవుతుంది ఆయన తెలిపారు.ఆటిజం పూర్తిగా నయం అయ్యే వ్యాధి కాదు, కానీ సరైన థెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియరల్ థెరపీ ద్వారా పిల్లలు సాధారణ జీవితానికి దగ్గరగా ఉండగలరు.ఆటిజం ఉన్న పిల్లలను అర్థం చేసుకోవడం, వారికి ప్రేమ, సహనం ఇవ్వడం చాలా ముఖ్యం. వారిని తక్కువగా చూడకుండా ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని ఆయన తెలియజేశారు.ఆటిజం గురించి అవగాహన పెంచడం ద్వారా పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చు అన్నారు. ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు మరియు సమాజం ఈ విషయం పై జాగ్రత్తగా ఉండాలి ఆయన తెలిపారు.

## పార్లమెంటులో అమరావతి బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూటిడిపి కూటమి నేతల సంబరాలు

**- విడవలూరులో భారీ ర్యాలీ నిర్వహించిన టీడీపీ కూటమి పార్టీల నాయకులు.**

**- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ హోం మంత్రి అమిత్ షా కు ధన్యవాదాలు**



అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడంపై కోవూరు నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు మేరకు విడవలూరు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. "అమరావతి మన రాజధాని – అమరావతి మన భవిష్యత్తు" అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో విడవలూరు గ్రామ వీధులు మార్మోగాయి. ?ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, కేంద్రంలోని కూటమి ప్రభుత్వ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి మన రాష్ట్ర శాశ్వత రాజధాని అని, దీని అభివృద్ధిని అడ్డుకోవడం ఎవరితరం కాదని వారు ధీమా వ్యక్తం చేశారు. ?ఈ భారీ ర్యాలీలో విడవలూరు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు సామాన్య ప్రజలు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ .!







**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 6న** తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నాయకులు, కార్యకర్తలు, అలాగే నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో తన నిబద్ధతను మరోసారి చాటిచెప్పారు. ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వయంగా ఓర్పుతో ఆలకించి, ప్రతి సమస్యను సమగ్రంగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో వెంటనే చర్చలు జరిపారు. సమస్యల స్వభావాన్ని బట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆలస్యం లేకుండా ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను స్పష్టంగా ఆదేశించారు.ప్రజల కష్టాలు తమవేనన్న భావంతో, ప్రతి వినతిని స్వీకరించి పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్న కాకర్ల సురేష్ ప్రజా సేవా తత్వం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి విశ్వాసాన్ని కలిగించింది.

## వింజమూరు పట్టణ అధ్యక్షులు గురిజాల గోపి కుమార్తె రోషిణి పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల..!



**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 6** వింజమూరు పట్టణంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్ లో వింజమూరు పట్టణ అధ్యక్షులు గురిజాల గోపి కుమార్తె చిన్నారి గురిజాల రోషిణి పుట్టినరోజు వేడుకలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సంతోషకరమైన వేడుకలకు ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారి రోషిణికి అక్షింతలు వేసి, ఆమెకు ఆయురారోగ్యాలతో, విద్యాభివృద్ధితో, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. అలాగే కుటుంబ సభ్యులతో కలిసి పుట్టినరోజు సంబరాల్లో పాల్గొని, చిన్నారికి తమ ఆప్యాయతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారి రోషిణికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వేడుకను మరింత ఆనందభరితంగా మార్చారు.

## జిర్రావారిపాలెం మార్కెటింగ్ యార్డ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!

**-రైతులతో ముచ్చటించి పంటల దిగుబడులపై వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!**

**-వరి, మొక్కజొన్న, సెనగ పంటల కొనుగోలు విధానంపై సమీక్ష..!**



**కలిగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 6** కలిగిరి మండలం జిర్రావారిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మార్కెటింగ్ యార్డ్‌ను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ పరిసరాలను పరిశీలిస్తూ, అక్కడి సౌకర్యాలపై సమగ్రంగా అవగాహన పొందారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ, వారు పండించిన వరి, మొక్కజొన్న, సెనగ వంటి పంటల దిగుబడుల పరిస్థితి గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే పంటల కొనుగోలు విధానం ఎలా జరుగుతోంది, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు రైతులకు సమయానికి అందుతున్నాయా, మార్కెట్లో ప్రస్తుతం ఉన్న రేట్లు రైతులకు అనుకూలంగా ఉన్నాయా అనే విషయాలపై చర్చించారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ జరిగేలా అధికారులకు సూచనలు చేస్తానని తెలిపారు.

## తూర్పు గుడ్లదానలో "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!

**-రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!**

**-సాగునీటి, తాగునీటి సమస్యల పరిష్కారానికి ఇది సువర్ణావకాశం...అధికారులు --నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచన..!**



**కలిగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 6** కలిగిరి మండలం తూర్పు గుడ్లదొన గ్రామంలో చెరువు వద్ద నిర్వహించిన "నీటి భద్రత -- నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు, అధికారులు, నాయకులతో కలిసి చెరువు పరిస్థితులను పరిశీలించి, నీటి నిర్వహణపై సమగ్రంగా చర్చించారుఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, మన కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతులను కేంద్రబిందువుగా ఉంచుకుని "రైతు ప్రభుత్వం"గా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా సాగునీటి వనరుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం వంటి చర్యలు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని వివరించారు.ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 149 చెరువులకు 149 మంది నీటి సంఘ అధ్యక్షులను నియమించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. ఈ అధ్యక్షుల ఆధ్వర్యంలో చెరువుల మరమ్మత్తులు, పూడికతీత పనులు సమర్థవంతంగా చేపట్టబడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన 100 రోజుల గడువులో ఈ పనులను పూర్తి చేయడం ద్వారా నియోజకవర్గంలో తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే, అధికారులు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల అధ్యక్షులు అందరూ సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమస్యాత్మక చెరువులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి, సమయానికి పూర్తి చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుందని అన్నారు. చెరువులను కేవలం నీటి నిల్వ కేంద్రాలుగానే కాకుండా, గ్రామాల అభివృద్ధికి మూలాధారంగా మార్చాలని పిలుపునిచ్చారు. అనంతరం తూర్పు గుడ్లదొన, పడమర గుడ్లదొన మరియు ఎరుకులరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన ఉమ్మడి చెరువు కట్ట విస్తరణ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించి, టెంకాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్



(కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు,డిఆర్ఓ విజయ్ కుమార్, , తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ హరిశ్చంద్రారెడ్డి తెలుగు గంగ స్పెషల్ అధికారి కేశవర్ధన్ రెడ్డి, డి.పీ.ఓ వసుమతి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నాగ శేఖర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. కి- పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ అప్ లోడ్ విషయములో కొన్ని శాఖలు ఇంకా మొదలు పెట్టలేదని, మరికొన్ని శాఖలు వెనకంజలో ఉన్నాయన్నారు. శాఖల వారీగా సమీక్షించి ఈ నెల 8 వ తేది లోపు కి- పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆయన సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లను జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతోపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు......

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.